
అనుకున్నంతా అయింది. 'కల్లూరు' చేరేసరికి రాత్రి పదిగంటలు అయింది. అంటే, గంటన్నర ఆలస్యం అన్నమాట. 'దుర్గాపురం' నైట్ హాల్ట్ లాస్ట్ బస్సు ఇరవై నిముషాల క్రితమే వెళ్లిపోయిందన్న వార్త విని, దిక్కుతోచకుండా నిలబడిపోయాం నేనూ, శ్రీమతి. వెధవ 'డీలక్సు' బస్సు! చార్జీ ఎక్కువయినా ఫర్వాలేదు. ప్రయాణం సుఖంగా సాగుతుందని, తక్కువ 'స్టాపు'లతో తొందరగా గమ్యం చేరుస్తుంది కదాని ఎక్కాం. కానీ మోసం చేసింది. మార్గ మధ్యంలో ఏదో ట్రబులిచ్చి, చివరికిలా మమ్మల్ని ట్రబుల్స్‌లో పడేసింది.

# క్షణక్షణం

—అవధానుల సుధాకరరావు



మా స్థితిని చూసి, 'ఆర్టీసీ కంట్రోలర్' ఓ ఉచిత సలహా చెప్పి, పుణ్యం కట్టుకున్నాడు - "జంక్షన్ దగ్గరికెళ్లి నిలబడితే, సిమెంట్ ఫ్యాక్టరీ తాలూకు లారీలు తగుల్తాయి. మనిషికి ఐదు చొప్పున తీసుకుని వాళ్లు ఆ దారిలో ఉన్న ఊళ్ళోకి ప్రయాణీకుల్ని చేరవేస్తుంటారు..." అని. హమ్మయ్య... అనుకున్నాం మేం. ఆ మాటకే ఇల్లు చేరుకున్నంత ఆనందం కలిగిందప్పుడే.

ఓ పది నిముషాల నడకతో 'జంక్షన్' అనబడే ఆ నాలుగు రోడ్ల కూడలిని చేరుకున్నాం. 'జగ్గయ్యపేట' వెళ్లే 'రూటొ'లో ఉంది - మా అత్తగారి ఊరు 'దుర్గాపురం'. తెల్లవారితే సంక్రాంతి. మా పెళ్ళయి నెల కూడా కాలేదు. మొదటి పండుగ కాబట్టి, సతీసమేతంగా బయల్దేరటం తప్పనిసరయింది.

పది నిముషాల నిరీక్షణ తర్వాత మాకు లారీ దొరికింది. క్లీనర్ వెనక్కు మారేడు. నేను, శ్రీమతి డ్రైవర్ పక్కన, 'కేబినొ'లో కూర్చున్నాం. ట్రంకు రోడ్డు మీద లారీ వేగంగా పోతోంది. గతుకుల మూలంగా కుదుపులు అంతకంతకూ ఎక్కువవుతున్నా డ్రైవరు ఏ మాత్రం స్పీడు తగ్గించటం లేదు.

చలిగాలి రివ్వున వీస్తోంది. కాటుకలాంటి చిక్కటి చీకటి అంతటా పర్చుకొని వుంది. అవకాశం కలిసొచ్చేసరికి, నాలో చిలిపితనం గంతులు వేసింది. శృంగారభావాలు పురి విప్పుకున్నాయి. నా చేతి వేళ్లు ఆమె నడుం మడతల్లో కదుల్తూ, నయ్యాటలాడుతున్నాయి. కానీ, మూడో మనిషి సమక్షం, స్త్రీ సహజమైన బిడియం వల్ల, జయ నా సరసాన్ని కొనసాగనివ్వడంలేదు.

ఇంకెంత. ఓ ఇరవై నిముషాలు ఓపిక పడితే ఇంట్లో ఉంటాం. సుబ్బగా భోంచేసి, గదిలో దూరి - మెత్తని పరుపు మీద - ఈ చలి రాత్రిని చిత్తు, చిత్తుగా ఓడిస్తాం! నా జీవితంలో కెల్లా గొప్ప అదృష్టం - జయలక్ష్మిని భార్యగా పొందడం. అని చెప్పడానికి నేనెంత మాత్రం సందేహపడను. జయ 'ఇంటర్' ప్యాసయింది. చాలు. అంతకు మించి చదువు అక్కర్లేదు. సహృదయం, మంచితనం సరేసరి. నేనంటే చెప్పలేనంత ప్రేమ. నూరేళ్ళ నుంచి కలిసున్నంత గాఢమైన అనుబంధం ఏర్పడింది. మా మధ్య - నెల రోజుల సహజీవనానికే.

జయలో అందం, ఆకర్షణ మెండుగా వున్నాయి. అపరంజి బొమ్మ, మెరుపుతీగ వగైరా పదాలకి సరైన నిర్వచనంగా ఆమెని చూపించొచ్చు. తీర్చి దిద్దినట్లున్న చక్కటి శరీర సౌష్టవం - నా పాలిట 'వరం' గా అనుకుంటూ, మురిసిపోతాను. మేం చేరాల్సిన గమ్యం ఇంకా ఓ పదికిలో మీటర్లు ఉండగానే, హఠాత్తుగా, పెద్ద శబ్దంతో లారీ టైరు పంక్చరయింది. మేం హతాశులయ్యాం. ఎన్ని విఘ్నాలు...? ఏ ముహూర్తంలో బయల్దేరామోగాని, అడుగడుగునా ఆటంకాలే. లారీ నడిరోడ్డులో నిలిచిపోయింది. దేవుడా! మా కేది దారి? ఇక్కడ్నుంచి బయటపడ్డం ఎలాగూ...?

ఆ పరిసరాలు మాకు మరింత భయాన్ని రేకెత్తించేలా వున్నాయి. చిమ్మ చీకటి. ఆకాశం దట్టంగా మేఘావృతమయి, ఇప్పుడో, ఇంకాసేపట్లోనో కుండపోతగా వర్షం కురిసే సూచనలు కన్పిస్తున్నాయి. రోడ్డు కిరువైపులా ఊడలు దిగిన వృక్షాలు - జడలు విరబోసుకున్న దయ్యాల్లా ఉండి, మనసులో జడుపుని కలిగిస్తున్నాయి. అడవిలాంటి ప్రదేశమది.

డ్రైవరు, క్లీనరు రిపేరు సంగతి చూడకుండా, తీరిగ్గా మా ఎదురుగానే 'మందు' కార్యక్రమంలోకి దిగారు. పెద్దగా పగలబడి నవ్వుకుంటూ, ముతక జోకులు, బూతులు మాట్లాడుకుంటూ వెంట తెచ్చుకున్న 'ప్యాకెట్ల'ని ఖాళీ చేయడంలో మునిగిపోయారు.



నడి సముద్రంలో నావ ఆగిపోయింది. అందులోని జాన్ భయంతో దేవుడిని ఇలా తలచుకున్నాడు.

"ప్రభూ...! ఇంతవరకూ ఎన్నో తప్పులు చేశాను... అవన్నీ క్షమించు... ఇకపైన తాగుడు, సిగరెట్లు..." ఇంకా ఏదో చెప్పబోతున్న జాన్‌ను మధ్యలోనే ఆపింది లూసీ.

'ఆగు... జాన్... తొందరపడకు.. దూరంగా ఏదో ఓడ వస్తుంది అంది.'

- చంద్రిక, నెల్లూరు

ఆ చివర్నుంచి ఈ చివరి దాకా రోడ్డంతా ఖాళీ. సంచారమన్న మాటేలేదు.

భగవంతుడా! ఎరక్కపోయి ఈ లారీ ఎక్కేం. మేం క్షేమంగా ఇక్కడ్నుంచి బయటపడతామా....? ఎలాంటి విపత్తు, ఆపద ఎదురుకాకుంటే ఎంతబావుణ్ణు.

కాని, ఇవ్వాళ అన్నీ అపశకునాలు, అశుభాలే కన్పిస్తున్నాయి. ఏదో జరుగుతుంది.

ఆ 'బస్టాండు'లోనే ఉండిపోయినా బాగుండేది. ఇక్కడ మాకు దిక్కెవరు..?

వాళ్ల దృష్టి ఈ పాటికే 'జయ' మీద పడి ఉంటుంది. బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు... అనలేదూ? 'మందు' కార్యక్రమం పూర్తికాగానే నిర్దాక్షిణ్యంగా జయని నా కళ్లెదురుగానే...? ఒకవేళ నేను ప్రతిఘటించినా, ఒంటి ఊపిరిగాణ్ణి, నన్నొదిలించుకోవటం ఎంతసేపు...? అందునా, వాళ్ల దగ్గర ఇనుపరాడ్లు కూడా ఉన్నాయి.

ఆడవాళ్ల మానభంగాల వార్తలు మనసులో మెదిలాయి. ఇప్పుడా 'లిస్టు'లో 'జయ' పేరు కూడా చేరబోతుందా..? ఆ దారుణం జరిగితే భరించడం తన వల్లవుతుందా...? నో.. తనకంత ఔదార్యం లేదు. తన వస్తువులు తన సొంత అవసరానికే వినియోగమవ్వాలనే సిద్ధాంతం తనది. తమ్ముడు తన చొక్కా తొడుక్కుంటేనే సహించలేడు. తన చెప్పుల్లో ఇంకెవరన్నా కాళ్లు పెడితే- వాటిని విసిరి అవతల పారేస్తాడు. తను రాసే కలం- తన చేతి వేళ్ల మధ్యనే ఉండి, అక్షరాల్ని కురిపించాలి. మరొకరికి చచ్చినా ఇవ్వడు.

ఆఖరికి, 'స్మోక్' చేసేటప్పుడు తను తాగే సిగరెట్‌ని ఎవరన్నా అంటించుకోడానికి అడిగినప్పుడు- ఇవ్వడానికి తన మనసొప్పదు. ఎంగిలైపోదూ?

అలాంటిది.. జీవితంలో సగభాగం, జీవితాంతం తనికి 'తోడు'గా ఉండాల్సిన మనిషి, సుఖసంతోషాల్లో తనని ముంచాల్సిన భార్య- ఇద్దరు మగాళ్ల చేతుల్లో నలిగిపోయి, శీలం కోల్పోయి, సర్వస్వం దోచుకోబడితే....? ఇంకా తనకు మిగిలేదేమిటి...?

ఆ మలినదేహం తనకి మునుపటిలా ముద్దొస్తుందా? ఆరాధనలో పడేస్తుందా...??

నో. అది తను భరించలేడు.

అప్పుడిక విషాదపు ముగింపే. ఇద్దరూ కలిసి విషం త్రాగడమో, రైల్లోంచి దూకడమో, గోదాట్లో మునిగిపోవడమో...

డ్రైవరు లేచి నిలబడి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. వీడి దుంపతెగ. ఏం పర్సనాలిటీ...? దున్నపోతులా తెగ బలిసాడు.

నేనెంతో అపురూపంగా, దంతపు బొమ్మలా చూసుకుంటూ, సున్నితంగా వ్యవహరిస్తాను 'జయ' విషయంలో. అలాంటిది, ఇప్పుడు వాడి మొరటు చేతుల్లో పాశవికంగా...

ఆపైన ఊహించలేకపోయాను.

వాడు ఒంటిమీది 'లుంగి' విప్పిపారేసాడు.

చిన్న నిక్కరు ఉంది లోపల. బాబోయ్.... ఇక 'బలాత్కార' కార్యక్రమానికి సిద్ధపడుతున్నాడా...? ఎందుకైనా మంచిదని, మేం ముందుగానే వాళ్లకి కాస్త దూరంగానే కూర్చున్నాం. ఇప్పుడేం చెయ్యాలి? పరుగెత్తాలా? అసాధ్యం. కడుపులో ఆకలి దంచేస్తోంది. ఏమాత్రం ఓపిక లేదు.

డ్రైవరు, క్లీనరు, సీరియస్‌గా టైరు మార్చే పనిలో పడ్డంతో మా 'అంచనాలు' తారుమారయ్యాయి.

పర్లేదు. దేవుడు మా మొర విన్నాడు. మనసులో 'టెన్షన్' కాస్త తగ్గింది.

వీస్తున్న చల్లగాలికి ఒంటిమీది చెమట ఆరిపోయి, హాయి కల్గిస్తోంది.

మా మనసులో భయం లాగే- ఆకాశంలోమబ్బులు కూడా తేలిపోయి, చందమామ కన్పించింది. వెన్నెలొచ్చింది.

చకచకా ఇరవై నిముషాల్లో పనిని పూర్తిచేసి, లారీ 'స్టార్ట్' చేశాడు డ్రైవరు.

ఆ 'శబ్దా'నికి మా ప్రాణం లేచొచ్చింది. మధురమైన సంగీతంలా విన్పించింది.

అంత 'రిలీఫ్' ఎప్పుడూ అనుభవించలేదు. "క్షమించండి సారా! పాపం... మీకు చాలా ఆలస్యమయింది" సంజాయిషీగా అన్నాడు డ్రైవర్. లారీ స్పీడుగా ముందుకి పోతోంది.

"ఇందులో నువ్వు చేసిన తప్పేముందయ్యా...? అన్నాను తేలిగ్గా, నిండు మనసుతో, అభిమానం మేళవించి.

ఈ మనిషినే కదా- కొద్దిసేపటి క్రితం నేను తీవ్రంగా ద్వేషించి, అసహ్యించుకున్నాను.

రాక్షసుడు, దుష్టుడు అని ఎంత చెడ్డగా అనుకున్నాను.

లారీ మమ్మల్ని సురక్షితంగా 'గమ్యం' చేర్చింది. జయ, నేను దిగేం. ఓ ఇరవై రూపాయలు అతని చేతికందించగా- 'వొద్దు సార్' అన్నాడు. మేం ఆశ్చర్యపోయాం.

అతనన్నాడు- రేపు రాఖీ పండగ. మా చెల్లెలు చచ్చిపోయి. రెండేళ్లవుతోంది. అప్పట్నుంచీ ఏ ఆడకూతుర్ని చూసినా నా చెల్లెలు రూపమే కన్పిస్తోంది.

అమ్మా! నువ్వేం అనుకోకపోతే, ఈ చేతికి రాఖీ కడతావా...? అనడిగాడు ఆశగా, చిన్నపిల్లాడిలా- జేబులో సిద్ధంగా ఉంచుకున్న రాఖీని బయటకు తీసి.

మేం విచలితులమయ్యాం. మొహాలు చూసుకున్నాం. నేనైతే లోలోపల సిగ్గుపడ్డాను.

అతని ఆకారాన్ని చూసి, ఒకటి, రెండు బలహీనతల్ని తెలుసుకుని- ఎంత తక్కువగా అంచనా వేశాను? ఎంత చెడ్డగా ఊహించేను...??

పొరపాటే! మనసులో లేనిపోని భయాల్ని పెంచేసుకుని ఎదుటివాళ్లు మనకేదో కీడు తలపెడతారని, వాళ్ళు, ప్రపంచంలోకెల్లా పాపాత్ములని అనుకోవడం తప్పు కదూ...?